రవాణా యాతన


వ్యవసాయశాఖ కార్యాలయం రోడ్డులోని పండ్ల దుకాణం వద్ద..


భట్టిప్రోలు–చావలి రహదారిలో నెలకొన్న దుస్థితి

- భట్టి ప్రోలులో ట్రాఫిక్ సమస్య జటిలం
- ఇరుకు రోడ్లతో అవస్థలు
- రోడ్లపైకి చొచ్చుకు వస్తున్న ఆక్రమణదారులు
- రోడ్లపైనే సరుకుల ఎగుమతి, దిగుమతి
- ఫీట్లు చేస్తున్న డ్రైవర్లు

భట్టిప్రోలు: భట్టిప్రోలులో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య జటిలమవుతోంది. ఇందుకు కారణం ఇరుకు రోడ్లు. ఇలాంటి రోడ్లు ఏ గ్రామ పంచాయతీలోనూ లేవంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా చావలి బస్టాండ్ సెంటర్ ప్రతి రోజూ ఉదయం సాయంత్రం వేళల్లో రద్దీగా ఉంటోంది. ఉదయం స్కూల్ బస్సులతో పాటు ఆర్టీసీ బస్సులు, ఆటోల రద్దీ విపరీతంగా ఉంది. సాయంత్రం ఇదే పరిస్థితి పునరావృతమవుతుంది. పంచాయతీ పరిధిలో సుమారు 15 వేల మంది జనాభా ఉన్నారు. వీరు కాక చుట్టుపక్కల గ్రామాల నుంచి వ్యాపార అవసరాల నిమిత్తం వందలాది మంది వస్తూ పోతుంటారు. అంతేకాక నిత్యావసర వస్తువులు దిగుమతి చేసే లారీలు, ఎరువు లోడుతో వచ్చే లారీలతో పాటు ఆటోలు ఎక్కడపడితే అక్కడ నిలిపివేస్తున్నారు. ముఖ్యంగా చావలి బస్టాండ్ సెంటర్‌లో బస్సు టర్నింగ్ తిప్పాలంటే డ్రైవర్లు ఫీట్లు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. రథం సెంటర్‌లోనూ ఇదే పరిస్థితి. ఈ రెండు రహదారులు సింగిల్ రోడ్లు కావటమే ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణం. ఈ ఇరుకు రోడ్లలో గృహ, వ్యాపార వాణిజ్య దుకాణాల ముందు యజమానులు తమకు ఇష్టమొచ్చినట్లు మెట్లు, అరుగులను ఏర్పాటు చేయటంతో ఒక వాహనానికి ఎదురుగా మరో వాహనం వస్తే తప్పుకోవటానికి అవకాశం లేకుండా పోతోంది. ఇక స్టేట్‌బ్యాంక్ వద్ద ఐతే పరిస్థితి వర్ణనాతీతం. బ్యాంక్‌కు వచ్చే ఖాతాదారులు రహదారికి ఇరువైపులా వాహనాలు నిలుపుదల చేయడంతో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఇక్కడ వాహనాలు తప్పుకోవాలంటే పద్మవ్యూహం నుంచి బయట పడినట్లే అన్నట్లు తయారైంది పరిస్థితి. పలు సందర్భాల్లో వాహన దారుల మధ్య వివాదాలు, ఘర్షణలు చోటుచేసుకున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. అంతేకాక రోడ్లు కూడా కుచించుకుపోతున్నాయి. భట్టిప్రోలులో వ్యాపార సంస్థల కన్నా గోదాంలే అధికంగా ఉన్నాయి. వ్యాపారస్తులు తమ వ్యాపారానికి అనుగుణంగా షాపులను గోదాములుగా మారుస్తున్నారు. ఇరుకు రోడ్లలో వాహనాల రాకపోకల వల్ల ధ్వని కాలుష్యం అధికమవుతోంది. నిత్యం రద్దీగా ఉండే చావలి బస్టాండ్, రథం సెంటర్లలో ట్రాఫిక్ నియంత్రించేందుకు పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ట్రాఫిక్ కంట్రోల్‌కు చర్యలు



ముఖ్య కూడళ్లలో ట్రాఫిక్ కంట్రోల్ చేయడానికి ప్రత్యేకంగా కానిస్టేబుల్‌ను నియమించేందుకు చర్యలు తీసుకుంటాం. దుకాణాల ఎదుట వాహనాలు నిలుపుదల చేయకుండా యజమానులు చూడాలి. ప్రధాన రహదారుల్లో లోడింగ్, అన్‌లోడింగ్ చేసే విషయమై దృష్టి సారిస్తాం.

–అంబటి చంద్రశేఖర్, ఎస్‌ఐ, భట్టిప్రోలు

క్లుప్తంగా

ప్రతి ఇంటికీ సంక్షేమం



కర్లపాలెం: ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ సమ్మెట వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. గురువారం కర్లపాలెంలో జరిగిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అంటించి, బ్రోచర్లు అందజేశారు. చింతాయపాలెం, ఏట్రవారిపాలెం, పేరలి, యాజలి, తుమ్మలపల్లి గ్రామాల్లో ప్రచార కార్యక్రమం జరిగింది. కర్లపాలెం ఎంపీటీసీ సభ్యుడు ఆసిఫ్ అలీ, ఉప సర్పంచ్ పఠాన్, సచివాలయాల కన్వీనర్ షంషీర్, వార్డు మెంబరు జానీ, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు



పిట్టలవానిపాలెం: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు జరిగాయి. ఎంపీడీఓ కె.పద్మజ మాట్లాడుతూ.. భవనంవారి పాలెం, ఖాజీపాలెం, గోకరాజు నల్లిబోయినవారి పాలెం గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారిని ఇంటర్వ్యూ చేసి, అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు.

విద్యా ప్రమాణాలు పెంపునకు కృషి చేయాలి



పిట్టలవానిపాలెం: విద్యా ప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని తహసీల్దారు కవిత పేర్కొన్నారు. మంతెనవారిపాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకాన్ని గురువారం ఆమె పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వారంలో ఒక రోజు గ్రామ సచివాలయాన్ని, పాఠశాలను తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల హాజరు, అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను తనిఖీ చేశారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం



భట్టిప్రోలు: భట్టిప్రోలు ప్రధాన రహదారిలో పైప్‌లైన్ మరమ్మతులకు గురికావడంతో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని సర్పంచ్ దారా రవికిరణ్మయి గురువారం తెలిపారు. అద్దేపల్లి, అల్లూరు కాల్వ కట్ట, కూరగాయల మార్కెట్ పరిధిలోని రక్షిత తాగునీటి సరఫరా పథకాల ద్వారా తాగునీరు సరఫరా అవుతున్న ప్రాంతాలకు ఈ అంతరాయం కలుగుతుందని చెప్పారు. యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు. శుక్రవారం సాయంత్రం తాగునీరు సరఫరా యాథావిధిగా జరుగుతుందని తెలిపారు. గ్రామ ప్రజలు సహకరించాలని ఆమె కోరారు.

మట్కా, పేకాట నిర్వహిస్తే జైలుకే

కొల్లిపర: మండలంలో ఎక్కడైనా మట్కా, పేకాట వంటి అసాంఘిక కార్యకాలాపాలకు పాల్పడితే జైలుకు పంపుతామని ఎస్‌ఐ ఆర్.రవీంద్రరెడ్డి హెచ్చరించారు. గురువారం ఆయన వల్లభాపురం, మున్నంగి, అత్తోట, తూములూరు, హనుమాన్‌పాలెం తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శాంతియుతంగా జీవనం సాగించాలన్నారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలుంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగితే వదిలే ప్రసక్తి లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ పోతురాజు, రైటర్ శ్యామ్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ తాతారావు , కానిస్టేబుల్ కూర్మారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బండ్లమ్మ తిరునాళ్ల ఏర్పాట్లు

- వచ్చే నెల 3 నుంచి ప్రారంభం


అమ్మవారి పురాతన ఆభరణాలు (ఫైల్)


ఆభరణాల అలంకరణలో అమ్మవారు(ఫైల్)

చందోలు(పిట్టలవానిపాలెం) : అమ్మలగన్న అమ్మ, ముగ్గురమ్మల మూలపుటమ్మ ఆది పరాశక్తి ఆ అమ్మ ప్రతిరూపమేనని భక్తుల ప్రగాఢ నమ్మకం. బావిలో విగ్రహం దొరకగా దేవాలయం నిర్మాణంలో అమ్మవారి ఆభరణాలు దొరకటంతో ఈ ఆలయం దినదినాభివృద్ధి చెందుతోంది ఇక్కడ మొక్కులు తీర్చుకున్న వారికి అమ్మవారు కొంగుబంగారమై కోరిన కోర్కెలు తీరుస్తుందని భక్తుల విశ్వాసం. మహిమ గల బండ్లమ్మ వారి తిరునాళ్ల మే నెల 3నుంచి 7వ తేదీ వరకు అంగరరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలో బగళాముఖి అమ్మవారు వెలిశారు. క్రీ.శ 11వ శతాబ్దంలో చందోలు ప్రాంతాన్ని పాలిస్తున్న చోళరాజు ఈ ప్రాంతంలో బండ్లతో నిండుగా రాళ్లను తెప్పించి శివాలయం నిర్మించాలని తలపెట్టారు. అప్పుడు.. ప్రస్తుతం అమ్మవారు దేవాలయం ఉన్న చోట బండ్లు నిలిచిపోయాయి. దీంతో పండితులను పిలిపించి ఇందుకు గల కారణం తెలపాలని అడుగగా.. బండ్లు ఆగిన ప్రాంతంలో గ్రామాన్ని రక్షించే గ్రామ దేవత కొలువై ఉందని, ఆ దేవతకు దేవాలయం నిర్మించాలని చోళరాజుకు వివరించారు. అమ్మ విగ్రహం కోసం తవ్వకం జరిపిన కందకంలో జలం వెలువడగా.. దానిని బావిగా కట్టించారు. ఆ బావి బండ్లమ్మ బావిగా ప్రసిద్ధి చెందింది. అదే బావిలో అమ్మవారి విగ్రహం లభించింది. ఒక సమయాన కొందరు వ్యాపారులు ఈ దారి వెంట సరుకులు నిండిన బండ్లతో వ్యాపారానికి వెళ్తుండగా.. వారి బండ్లపై నిండు ''జవ్వని''గా అమ్మ సాక్షాత్కరించటంతో బండ్లమ్మ అమ్మవారిగా ప్రసిద్ధి చెందారు.

2002లో ఆభరణాలు దొరికాయి ఇలా..

2002లో బండ్లమ్మ దేవాలయ ముఖ మండప నిర్మాణానికి పునాదులు తవ్వుతుంగా.. కేజీ 467 గ్రాములు కలిగిన అమ్మవారి బంగారు ఆభరణాలు బయటపడ్డాయి. ఈ ఆభరణాల్లో అమ్మవారి వడ్డాణం, కమ్మలు, చెవి దిద్దులు, హారం, ముక్కు పుడక, మంగళ సూత్రాలు, కను బొమ్మలు ఉన్నాయి. అప్పట్లో ఈ విషయం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ నగలు అమ్మవారికి చెందాలని భక్తులు, ప్రభుత్వానికి చెందాలని పురావస్తు అధికారుల మధ్య వాదనలు తలెత్తాయి. ఈ వివాదం కోర్టుకు కూడా వెళ్లింది. ఆభరణాలను అప్పట్లో కోర్టు ఆదేశాల మేరకు రెవెన్యూ, పోలీసు, దేవాదాయ, పంచాయతీ, గ్రామస్తులు కలసి చందోలు ఎస్‌బీఐలో భద్రపరచడం జరిగింది. ఏటా నిర్వహించే బండ్లమ్మ వారి తిరునాళ్ల లో ఒక రోజున కోర్టు అనుమతితో రెవెన్యూ, పోలీస్, దేవాదాయ శాఖలు, గ్రామ ప్రజల సమక్షంలో బ్యాంకులోని నగలను తీసుకొచ్చి.. అమ్మవారికి అలంకరించడం జరుగుతుంది. వచ్చే నె 3న అఖండ జ్యోతితో అమ్మవారి తిరునాళ్ల ప్రారంభించి, తవ్వకాల్లో లభించిన బంగారు అభరణాలతో 6న అలంకరణ గావించి, సాయంత్రానికి మరలా బ్యాంకులో నగలు డిపాజిట్ చేస్తారు. ఆభరణాల అలంకరణ సమయంలో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు రాష్ట్రంలోని నలు మూలల నుంచి వస్తుంటారని దేవాదాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఇందుకు అవసరమైన బందోబస్తును పోలీసు శాఖ కల్పించనుంది.

30న వలివేరులో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన

చుండూరు(భట్టిప్రోలు): చుండూరు మండలం వలివేరులో వేంచేసి ఉన్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన, పూజా కార్యక్రమాలు ఈ నెల 30న అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవాలయం నిర్మాణంలో ఉన్నందున అభివృద్ధికి సహకరించాలని గ్రామానికి చెందిన వి. ప్రభాకరరావు కోరారు.

గ్రామ సచివాలయం సందర్శన

పెనుమర్రు(వేమూరు): ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ గ్రామ సచివాలయం సిబ్బంది అందజేయాలని మండల ప్రత్యేకాధికారి జె.రాజవర్ధన రావు పేర్కొన్నారు. పెనుమర్రు గ్రామ సచివాలయాన్ని గురువారం సందర్శించారు. సిబ్బంది సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, శ్రీనివాసరావు, సువర్ణరావు, వీఆర్వో జితేంద్ర పాల్గొన్నారు.

ఆరోగ్య సుస్థిరత ప్రణాళిక కమిటీ ఏర్పాటు


ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్షిస్తున్న ప్రత్యేకాధికారి రాజవర్ధనరావు

వేమూరు: అనారోగ్యంతో బాధపడుతున్న పిల్లలకు మంచి వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసిందని మండల ప్రత్యేకాధికారి జె.రాజవర్ధన రావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి మండల ప్రత్యేకాధికారి చైర్మన్‌గా, మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, ఎంపీడీఓ, ఏపీఎం సభ్యులుగా ఉంటారు. అంగన్ వాడీ సూపర్ వైజర్లు కన్వీనర్‌లుగా వ్యవహరించడం జరుగుతుందని రాజవర్ధన రావు తెలిపారు. గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న పిల్లల ఆరోగ్య పరిస్థితులను కమిటీ దృష్టికి తీసుకొని రావాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సునీత, డాక్టర్ వెంకట సురేష్, ఏపీఎం శోభన్, అంగన్ వాడీ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

సహకార బ్యాంకులో డిపాజిట్లపై అధిక వడ్డీ

కొల్లిపర: కో–ఆపరేటివ్ బ్యాంకులో ఇతర వాణిజ్య బ్యాంకుల కంటే డిపాజిట్లపై సీనియర్ సిటిజన్లకు అధిక వడ్డీ ఇస్తున్నట్లు కొల్లిపర సొసైటీ బ్రాంచి మేనేజర్ షేక్ బాజీబాబా తెలిపారు. గురువారం స్థానిక సొసైటీ బ్యాంకులో ఖాతాదారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడారు. రైతులు సొసైటీలో తీసుకున్న రుణాలను గడువులోపు చెల్లిస్తే తక్కువ వడ్డీ, మరలా అధిక రుణం ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. బ్యాంకు ద్వారా ఇప్పటి వరకు దీర్ఘకాలిక రుణాలు కింద రూ.40కోట్లు , స్వల్ప కాలిక రుణాలు రూ.20కోట్లు, ఇతర రుణాలు రూ.30 కోట్లు ఇవ్వటం జరిగిందన్నారు. ఇవి కాకుండా రైతులకు సబ్సిడీతో 8 ట్రాక్టర్లను ఇచ్చినట్లు తెలిపారు. ప్రతి రైతు బ్యాంకు సేవలను సద్వినియోగంచేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు బొంతు శ్రీనివాసరెడ్డి, అసిస్టెంట్ బ్యాంకు మేనేజర్ టి.ప్రవీణ్, బ్యాంకు సిబ్బంది కృషి పవన్, రైతులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎంపీడీఓ రాధాకృష్ణ


తాగునీటిని అందిస్తున్న గోపాలరావు

బాపట్ల అర్బన్: మూలపాలెం గ్రామంలో ఎంపీడీఓ రాధాకృష్ణ చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ప్రజలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోలిమేర అనిల్ కుమార్, ఉపాధి హామీ పథకం ఏపీఓ కోటయ్య నాయక్, పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కోర్టు ప్రాంగణంలో చలివేంద్రం

రేపల్లె: పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో న్యాయవాది, వైఎస్సార్ సీపీ మాజీ కౌన్సిలర్ కరేటి రామ్మోహనరావు 2వ వర్ధంతి సందర్భంగా గుమ్మడి నాగయ్య ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకుడు, న్యాయవాది గుమ్మడి కుమార్ గురువారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేసన వెంకట గోపాలరావు ప్రారంభించారు. గోపాలరావు మాట్లాడుతూ కోర్టు పనులపై వచ్చే వారికి చలివేంద్రం వేసవి దాహార్తిని తీరుస్తుందన్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఏపీపీ పీఎస్‌బీ శర్మ, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీ విశ్వనాథగుప్త, న్యాయవాదులు దారం సాంబశివరావు, శ్రీనివాసరావు, ఒ.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థికి అభినందన


విద్యార్థి అనిల్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్ సుధాకర్

రేపల్లె: రేపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి కె.అనిల్ ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనపరిచినట్లు ప్రిన్సిపల్ సుధాకర్ పేర్కొన్నారు. కళాశాలలో విద్యార్థిని గురువారం అభినందించారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి అనిల్ 984 మార్కులు సాధించి, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఫలితాల్లో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఇది కళాశాలకే గర్వకారణమన్నారు. ప్రథమ సంవత్సరంలో 41 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, 21 మంది ఉత్తీర్ణత సాధించి, ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. ద్వితీయ సంవత్సరంలో 42 మందికి 21 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. విద్యార్థులను, అధ్యాపకులను ఆయన అభినందించారు.

భద్రాచల రామదాసు కీర్తనల ఆలాపన



తెనాలిటౌన్: పట్టణ తులసీరామ్‌చౌక్‌లోని రామ మందిరంలో రాముల వారి జన్మనక్షత్రం సందర్భంగా గురువారం భద్రాచల రామదాసు కీర్తనలను లక్ష్మీ సునీత బృందం సభ్యులు ఆలపించారు. రామ మందిరంలో పూజలు జరిపారు. ప్రతి నెలా ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓంశక్తి సునీల్, తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ యాప్‌లతో ప్రజలకు వైద్య సేవలు చేరువ


మాట్లాడుతున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

నగరం: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని బాపట్ల జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక ఎస్వీఆర్‌ఎం కళాశాలలో గురువారం నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల పీహెచ్‌సీ సిబ్బందికి మొబైల్ యాప్‌లపై ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడారు. మొబైల్ యాప్‌ల ద్వారా వైద్య సేవలు ప్రజలకు మరింత చేరువ అవుతున్నారు. ఏఎన్‌ఎం ఏపీ హెల్త్, ఎన్‌సీడీ, సీడీ, ఎనీమియా ముక్త్‌భారత్, హెచ్‌ఎంఐఎస్, వెక్టార్ హైజీన్, ఫ్రైడే డ్రైడే, ఐరన్ ఫోలిక్ యాసిడ్ వంటి యాప్‌ల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ యాప్‌లపై ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌ఎం, హెచ్‌ఎస్‌లకు శిక్షణనిచ్చినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ధూళిపూడి, చినమట్లపూడి, కావూరు, కనగాల, కూచిన పూడి పీహెచ్‌సీల వైద్యాధికారులు భవానిశ్రీ , తులసి రాజేశ్వరి, శ్రీలత, సీతాకుమారి, ఉషారాణి, గణాంకాధికారి పి.వేణు, సీహెచ్‌ఓ బాబురావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచులు, కార్యదర్శులకు సన్మానం



భట్టిప్రోలు: గ్రామ పంచాయతీలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దే విధంగా సర్పంచులు కృషి చేయాలని ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి సూచించారు. పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా 9 అంశాలలో అవార్డులు అందుకున్న సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులను మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. అవార్డులు అందుకున్న సర్పంచులు చొటూరి లక్ష్మి, (వెల్లటూరు), మోర్ల వెంకటేశ్వరమ్మ (కోనేటిపురం), పెద్దిశెట్టి రాంబాబు(ఆళ్లమూడి), వేములపల్లి వెంకటేశ్వరరావు(పెసర్లంక), మేరుగ రంగారావు(ఓలేరు), పంచాయతీ కార్యదర్శులు ఎ.రామ్‌కుమార్, వక్కలగడ్డ సురేష్, వీవీడీవీ ప్రసాద్, అంచె శ్రీదేవి, అడిగోపుల చిన వెంకటేష్‌బాబు, పిడపర్తి ప్రదీప్‌కుమార్, కాసుల గణేష్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు తిరుపీధుల ఉదయభాస్కరి, ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖర రావు, ఈవోపీఆర్డీ సీహెచ్ శేఖర్, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్య శాస్త్రి, పీఏసీఎస్ చైర్ పర్సన్ గోవర్ధన గిరి చినబుజ్జి, ఎంపీటీసీ సభ్యులు దున్నా తిరుపతి బాబు, దారావత్ కుమారిభాయి తదితరులు పాల్గొన్నారు.

పొదుపు గ్రూపుల్లో చేర్పులు, మార్పులకు అవకాశం

- డీఆర్డీఏ పీడీ అర్జునరావు


యానిమేటర్లు శిక్షణలో మాట్లాడుతున్న పీడీ అర్జునరావు

వేమూరు: డ్వాక్రా గ్రూపు సంఘాల సభ్యుల చేర్పులు, మార్పులు కోసం ప్రభుత్వం అవకాశం కల్పించిందని బాపట్ల డీఆర్‌డీఏ పీడీ బొంత అర్జునరావు తెలిపారు. వేమూరు విద్యా వనరుల కార్యాలయంలో డ్వాక్రా గ్రూపుల యానిమేటర్లతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డ్వాక్రా గ్రూపు సభ్యులు, డ్వాక్రా సంఘాలు, గ్రామ సంఘాల వివరాలను క్రోడీకరణ చేసేందుకు ప్రభుత్వం జాతీయ స్థాయిలో లోకోస్ యాప్ తీసుకొచ్చిందని తెలిపారు. లోకోస్ యాప్‌పై రెండో రోజు శిక్షణ తరగతులు గురువారం నిర్వహించారు. జగనన్న కాలనీ గృహ నిర్మాణాలపై ఇన్‌చార్జి ఎంపీడీవో సునీత, తహసీల్దారు శ్రామణ కుమార్‌తో సమీక్షించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. కొల్లూరు మండల కేంద్రంలోని వైఎస్సార్ క్రాంతి పథం భవనంలో యానిమేటర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. శిక్షణ తరగతులు పూర్తయిన తర్వాత గ్రామాల్లో డ్వాక్రా గ్రూపుల చేర్పులు, మార్పులు వెంటనే చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంలు శోభన్, రాము, తహసీల్దారు శ్రామణ కుమార్, ఇన్‌చార్జీ ఎంపీడీఓ సునీత, సీసీలు బుల్లిబాబు, మేరీ, సాయి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరులకు కాంగ్రెస్ నేతల నివాళి


సభలో మాట్లాడుతున్న పఠాన్ రాజేష్

బాపట్ల అర్బన్: శాంతి భద్రతల పరిరక్షణలో ప్రాణాలు త్యాగం చేసిన పోలీసు అమరవీరులకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు ఘన నివాళులర్పించారు. పట్టణంలోని అంజుమన్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం సంస్మరణ సభ నిర్వహించారు. కాంగ్రెస్ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు పఠాన్ రాజేష్ మాట్లాడారు. ప్రజల భద్రతకు భరోసానిస్తూ అంకితభావంతో పనిచేసే పోలీసుల సేవలు మరువలేనివన్నారు. పోలీసులను అమానుషంగా బలితీసుకున్న నక్సలైట్ల చర్యను ఖండించారు. అమరవీరులైన పోలీసులకు సంతాపాన్ని ప్రకటించి, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉండి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ కట్ట లాజర్, పీసీసీ సభ్యుడు, సీనియర్ నాయకుడు ఎస్వీఆర్ కుమార్, పట్టణ మహిళా అధ్యక్షురాలు దండు రేణుక, జిల్లా కార్యదర్శి నళిని, నాయకులు దోనేపూడి రవి, తాజుద్దీన్, ల్యాబ్ చిన్ని, యాసీన్ మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి


భోజనం రుచి చూస్తున్న విలియమ్స్

రేపల్లె రూరల్: విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, మండల ప్రత్యేక అధికారి విలియమ్స్ అన్నారు. బేతపూడి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చేది అధిక శాతం చిన్నారులు పేదవారేనని, విద్యతో పాటు నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందించే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పథకాన్ని అమలు చేస్తోందన్నారు. నాణ్యత లోపిస్తే సహించేదిలేదని స్పష్టం చేశారు. అనంతరం గ్రామంలోని సచివాలయాన్ని సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామంలో నిర్మిస్తున్న సచివాలయ, ఆర్‌బీకే భవన నిర్మాణాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.